గుండెపోటుతో 22 ఏండ్ల యువకుడి మృతి

పాండిచ్చేరి యూనివర్సిటీలో ఘటన

అనిరుధ్ శర్మ (ఫైల్)

హైదరాబాద్, ఫిబ్రవరి14 (నమస్తే తెలంగాణ): పాండిచ్చేరి టెక్నోలాజికల్ యూనివర్సిటీలో 22 ఏండ్ల తెలంగాణ విద్యార్థి గుండెపోటుతో మృతి చెందాడు. సిద్దిపేట జిల్లా తొగుట మండలం బంజేరుపల్లి ముంపు గ్రామానికి చెందిన కొరిడే అనిరుధ్ శర్మ (22) యూనివర్సిటీలో బీటెక్ (సివిల్) నాలుగో సంవత్సరం చదువుతున్నాడు. మంగళవారం రాత్రి అకస్మాత్తుగా గుండెపోటు రావడంతో మృతి చెందాడు. ప్రస్తుతం వారి కుటుంబం అల్వాల్ కానాజీగూడలో నివసిస్తున్నది. మృతుడి తండ్రి పద్మనాభశర్మ పౌరోహిత్యం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. విద్యార్థి అనిరుధ్ మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి, మృతదేహాన్ని స్వగ్రామానికి రప్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని మృతుడి తండ్రి, బంధుమిత్రులు కోరారు.

నేడు కొమురవెల్లిలో రైల్వేస్టేషన్ నిర్మాణానికి భూమిపూజ

చేర్యాల, ఫిబ్రవరి 14: సిద్దిపేట జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన కొమురవెల్లిలో గురువారం రైల్వేస్టేషన్(హాల్ట్) నిర్మాణానికి దక్షిణ మధ్య రైల్వే అధికారులు భూమిపూజ చేయనున్నారు. మనోహరాబాద్-కొత్తపల్లి నూతన రైలుమార్గంలో నిర్మించిన రైల్వే లైన్ సమీపంలో కొమురవెల్లి మల్లన్న క్షేత్రానికి మూడు కిలోమీటర్ల దూరంలో రైల్వే స్టేషన్(హాల్ట్) నిర్మించనున్నారు. కొమురవెల్లి స్వాగత తోరణం సమీపంలో కొమురవెల్లి ఆలయానికి వచ్చే రహదారి పక్కన రైల్వేస్టేషన్ నిర్మాణానికి సంబంధిత శాఖ అధికారులు ఇటీవల స్థలాన్ని ఎంపిక చేయడంతోపాటు భూమిపూజకు అన్ని ఏర్పాట్లు చేశారు.

టీటీజీడీఏ వెబ్‌సైట్ ఆవిష్కరణ

హైదరాబాద్, ఫిబ్రవరి 14 (నమస్తే తెలంగాణ): తెలంగాణ టీచిం గ్ గవర్నమెంట్ డాక్టర్స్ అసోసియేషన్ (టీటీజీడీఏ) వెబ్‌సైట్, క్యాలెండర్‌ను వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆవిష్కరించారు. బుధవారం మంత్రిని హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో సంఘం రాష్ట్ర ప్రతినిధులు కలిసి పలు అంశాలపై చర్చించారు. బదిలీలు, దవాఖానల్లో వసతుల కల్పన, కొత్తగా ఏర్పడిన కాలేజీల్లో పోస్టుల భర్తీ తదితర అంశాలపై హెల్త్ సెక్రటరీ క్రిస్టినా జెడ్ చొంగ్తూకి వారు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు డాక్టర్ అన్వర్, ప్రధాన కార్యదర్శి తిరుపతి రావు, ఉపాధ్యక్షుడు కిరణ్ మాదాల, కోశాధికారి కిరణ్ ప్రకాశ్ పాల్గొన్నారు.

విద్యుత్తు షాక్‌కు రైతు బలి

సోమ్లా (ఫైల్)

డోర్నకల్, ఫిబ్రవరి 14: విద్యుత్తు షాక్‌తో రైతు మృతి చెందిన ఘటన మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ మండల పరిధిలో చోటుచేసుకొన్నది. స్థానికుల వివరాల ప్రకారం.. రాము తండా పంచాయతీ పరిధి లకావత్ తండాకు చెందిన రైతు, మాజీ ఉప సర్పంచ్ లకావత్ సోమ్లా (55) తన వ్యవసాయ క్షేత్రానికి వెళ్తుండగా ఫెన్సింగ్ తీగ తాకి విద్యుత్తు షాక్‌తో అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికంగా ఓ రైతు త్రీ ఫేజ్ సర్వీస్ వైరు కింద తగలకుండా ఫెన్సింగ్ తీగకు కట్టాడు. ఆ సర్వీసు వైరు కట్ అయి ఫెన్సింగ్‌కు తీగకు విద్యుత్తు సరఫరా కావడంతో అది తగిలి రైతు సోమ్లా షాక్‌కు గురై మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు.

సాగర్ జల విద్యుత్తు కేంద్రాల పరిశీలన

నాగార్జునసాగర్, ఫిబ్రవరి 14: నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ బృందం బుధవారం రెండో రోజు నాగార్జునసాగర్ ప్రాజెక్టు పరిధిలోని పలు ప్రాంతాలను సందర్శించింది. ప్రధానంగా జల విద్యుత్తు కేంద్రాన్ని పరిశీలించింది. అనంతరం జెన్‌కో చీఫ్ ఇంజినీర్ మంగేశ్‌కుమార్ ఆధ్వర్యంలో జెన్‌కో సమావేశ మందిరంలో సమీక్షించింది. సాగర్ జలాశయంలో పూర్తిస్థాయి నీటి మట్టం ఉన్నప్పుడు ప్రధాన జల విద్యుత్తు కేంద్రంలో ఎంతమేరకు విద్యుత్తు ఉత్పత్తి అవుతుంది? ఎంత పరిణామంలో నీటిని వినియోగిస్తున్నారు? టర్బయిన్లు పని చేస్తున్నప్పుడు జలాశయంలోనికి నీటిని పంపే ప్రక్రియలో ఇబ్బందులు తలెత్తుతున్నాయా? వంటి వివరాలను జెన్‌కో అధికారులను బృందం సభ్యులు అడిగి తెలుసుకున్నారు.

పిడికిలెత్తి నినదిస్తున్న బీఆర్ఎస్ అధినేత కేసీఆర్

మంగళవారం బీఆర్ఎస్ నల్లగొండ బహిరంగ సభకు భారీగా తరలివచ్చిన ప్రజానీకం

నల్లగొండ సభతో బీఆర్ఎస్‌లో జోష్

ఉద్యమకాలం నాటి రోజులను గుర్తు చేసుకున్న శ్రేణులు

సూర్యాపేట, ఫిబ్రవరి 14 (నమస్తే తెలంగాణ): పదేండ్ల అనంతరం తెలంగాణ ఉద్యమ రోజులు గుర్తుకొచ్చేలా నల్లగొండలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పాల్గొన్న 'చలో నల్లగొండ' సభ పార్టీ శ్రేణుల్లో జోష్ నింపింది. సభలో కేసీఆర్ చెప్పిన ప్రతి మాట జనంలోకి, ప్రధానంగా రైతుల్లోకి వెళ్లింది. కృష్ణా ప్రాజెక్టులపై కాంగ్రెస్ కుట్రలు, అవగాహనా రాహిత్యంపై సర్వత్రా చర్చ జరుగుతున్నది. అధికారం కోల్పోయిన తరువాత బీఆర్ఎస్ శ్రేణుల్లో అలుముకున్న నైరాశ్యం కూడా ఈ ఒక్క సభతో దూరమైంది. అసెంబ్లీ ఎన్నికల అనంతరం పార్టీ అధినేత తొలిసారి బయటకు వచ్చి ప్రజా ఉద్యమానికి శ్రీకారం చుట్టడంతో నాయకులు, కార్యకర్తల్లో కొత్త ఉత్సాహం కనిపిస్తున్నది. ఉద్యమ ఖిలాగా పేరుగాంచిన నల్లగొండ గడ్డ బీఆర్ఎస్ కీలక సభలకు వేదికగా నిలిచింది. నాగార్జునసాగర్, శ్రీశైలం ప్రాజెక్టులను కేఆర్ఎంబీకి అప్పగించడాన్ని నిరసిస్తూ చేపట్టిన భారీ బహిరంగ సభ కూడా ఇక్కడే నిర్వహించడంతో రైతాంగం నుంచి అద్భుతమైన స్పందన లభించింది. వివిధ పద్ధతుల్లో తెలంగాణ మలి దశ ఉద్యమాన్ని నడిపిన కేసీఆర్ ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించే వరకూ విశ్రమించని సంగతి తెలిసిందే. అనంతరం స్వరాష్ట్రంలో కేసీఆర్ నాయకత్వంలో అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ తొమ్మిదిన్నరేండ్ల పాలనలో తెలంగాణ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలిపి దేశానికే దిక్సూచిగా నిలిపింది.

ఉద్యమకాలం నాటి పదును చూపిన కేసీఆర్

నల్లగొండ సభలో ఉద్యమస్ఫూర్తిని నింపే కేసీఆర్ మాటలకు జనం నుంచి విశేష స్పందన లభించింది. సభా వాతావరణం చూస్తే ఉద్యమకాలం నాటి రోజులు గుర్తుకొచ్చాయి. కొన ఊపిరి ఉన్నంతవరకు తెలంగాణకు అన్యాయం జరుగనియ్యనంటూ కేసీఆర్ చేసిన వ్యాఖ్యకు లక్షలాదిగా వచ్చిన జనం జై తెలంగాణ అంటూ నినదించారు. కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థత, అవగాహనా రాహిత్యంతో నాగార్జునసాగర్‌ను కేఆర్ఎంబీకి అప్పగించడాన్ని నిరసిస్తూ సాగిన ప్రసంగంలో ఎంతో పదును పెంచి వివరించారని సూర్యాపేటకు చెందిన టీఆర్ఎస్ సీనియర్ నాయకులు నిమ్మల శ్రీనివాస్‌గౌడ్, వై వెంకటేశ్వర్లు వ్యాఖ్యానించారు. కేసీఆర్ ఉద్యమ సమయంలో మాట్లాడినట్టుగా ఉన్నదని, జనం నుంచి అంతే మాదిరి స్పందన లభించింది. రాష్ట్రానికి అన్యాయం జరిగితే ఊరుకునేది లేదని నినదించిన సమయంలో నినాదాలతో సభ మర్మోగింది.

బీఆర్ఎస్ శ్రేణుల్లో నూతనోత్సాహం

కేసీఆర్‌లో ఉద్యమ పంథాలో ఏ మాత్రమూ వాడి తగ్గలేదని, శ్రేణుల్లో నూతనోత్సాహం నింపారని క్యాడర్ మాట్లాడుకుంటున్నది. కృష్ణా జలాల కోసం కోదాడ నుంచి హాలియా వరకు నాడు ఉద్యమనేతగా కేసీఆర్ చేపట్టిన పాదయాత్ర, నల్లగొండలో పార్టీ తొలి వార్షికోత్సవ సభ, సూర్యాపేటలో సమరభేరి సభ, భువనగిరిలో భారీ బహిరంగసభ, ఉద్యమ సమయంలో ఎమ్మెల్యేల మూకుమ్మడి రాజీనామాల అనంతరం నల్లగొండలో నిర్వహించిన సభ జ్ఞాపకాలను నెమరువేసుకుంటున్నది. సభ ముగిసిన తర్వాత ఎక్కడ చూసినా రైతుల్లో సాగర్ నీటి మీదే చర్చ వినిపిస్తుంది. కేసీఆర్ చెప్పదల్చుకున్నది ప్రజల్లోకి చేరిందని బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు చెప్తున్నారు.

గురుకుల అభ్యర్థులతో సర్కారు చెలగాటం

- డీఎల్, జేఎల్ నింపకుండా పీజీటీ భర్తీకి సిద్ధమవుతున్న ట్రిబ్
- నిబంధనలకు విరుద్ధంగా పీహెచ్‌సీ కోటా నియామకం
- ఎంపిక మొదలు తుది జాబితా వరకూ గోప్యత
- పోస్టింగులు లేకుండా ఆర్డర్ కాపీలే అంటూ హడావుడి
- నేడు సీఎం చేతులమీదుగా నియామకపత్రాల పంపిణీ
- ఆందోళనలో అభ్యర్థులు.. నేడు ధర్నాకు సమాయత్తం

హైదరాబాద్, ఫిబ్రవరి14 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ సర్కారు రాజకీయ ప్రయోజనాల కోసం ఉపాధ్యాయ ఉద్యోగార్థుల ఆశయాన్ని బలి తీసుకుంటున్నది. లోక్‌సభ ఎన్నికల్లో లబ్ధికోసం హడావుడిగా గురుకుల ఉపాధ్యాయ ఉద్యోగాల భర్తీని చేపట్టి అభ్యర్థులతో చెలగాటం ఆడుతున్నది. క్రమపద్ధతి లేకుండా నియామకాలను చేపడుతూ తమ జీవితాలతో చెలగాటమాడుతున్నదని అభ్యర్థులు నిప్పులు చెరుగుతున్నారు. బ్యాక్‌లాగ్ పోస్టులను తమ ఖాతాలో వేసుకునే కుట్రలకు రేవంత్‌రెడ్డి సర్కారు తెరలేపిందని ధ్వజమెత్తుతున్నారు. అందుకు తెలంగాణ రెసిడెన్షియల్ ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూట్ రిక్రూట్‌మెంట్ బోర్డు (ట్రిబ్) తీసుకుంటున్న నిర్ణయాలే బలాన్ని చేకూరుస్తున్నాయి. అంతా పారదర్శకంగా ఉంటే గోప్యత ఎందుకని అభ్యర్థులు ప్రశ్నిస్తున్నారు. మొత్తమ్మీద ప్రభుత్వ గురుకుల పోస్టుల భర్తీ ప్రక్రియ గందరగోళంగా మారింది. ప్రభుత్వ, ట్రిబ్ చర్యలను నిరసిస్తూ అభ్యర్థులు గురువారం ధర్నాకు పిలుపునిచ్చారు. ఎల్బీ స్టేడియం వద్దకు చేరుకొని నిరసన తెలపాలని నిర్ణయించారు. దీంతో సర్వత్రా ఉత్కంఠ నెలకొన్నది.

ప్రమోషన్ల తర్వాతే పోస్టింగులు ఇవ్వాలి

టీటీడబ్ల్యూఆర్ఈఐటీఏ రాష్ట్ర అధ్యక్షుడు రుషికేశ్‌కుమార్

హైదరాబాద్, ఫిబ్రవరి14 (నమస్తే తెలంగాణ): ప్రమోషన్లు, బదలీలను పూర్తిచేసిన తర్వాతే గురుకుల పోస్టులను భర్తీ చేయాలని తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్ టీచర్స్ అసోసియేషన్ (టీటీడబ్ల్యూఆర్ఈఐటీఏ) రాష్ట్ర అధ్యక్షుడు రుషికేశ్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రమోషన్లను కల్పించకుండా రిక్రూట్‌మెంట్ చేపడితే సీనియర్ ఉపాధ్యాయులు, అధ్యాపకులు, ఉద్యోగులు కొత్తవారి కంటే జూనియర్లుగా మారే ప్రమాదం ఉన్నదని పేర్కొన్నారు. దీర్ఘకాలంగా గురుకులాల్లో బదిలీలు చేపట్టలేదని, దీంతో ఏండ్ల తరబడి మారుమూల ప్రాంతాల్లో అనేక మంది సీనియర్లు పనిచేస్తున్నారని, వారంతా ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న మెరుగైన ప్రాంతాలను కోల్పోతారని తెలిపారు.

రాత్రికి రాత్రే పోస్టుల భర్తీకి సిద్ధం

రాష్ట్రవ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, బీసీ గురుకులాల్లో తొలుత నిర్ణయించిన దానికి విరుద్ధంగా పోస్టుల భర్తీ ప్రక్రియను చేపట్టేందుకు ట్రిబ్ రాత్రికి రాత్రే సిద్ధమైంది. మొత్తం 9 క్యాటగిరీల్లో 9,210 పోస్టుల భర్తీకి గత బీఆర్ఎస్ ప్రభుత్వం నియామక ప్రక్రియ చేపట్టింది. వీటిలో పీజీటీ 1276, టీజీటీ 4020, జూనియర్ లెక్చరర్, డిగ్రీ లెక్చరర్, ఫిజికల్ డైరెక్టర్ 2876, టీజీటీ స్కూల్ లైబ్రేరియన్ 434, స్కూల్ ఫిజికల్ డైరెక్టర్ 275, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ 226, మ్యూజిక్ టీచర్ 124 పోస్టులు ఉన్నాయి. డీఎస్, జేఎల్, ఆ తర్వాత పీజీటీ, టీజీటీ పోస్టులను వరుస క్రమంలో భర్తీ చేయాలని ట్రిబ్ నిర్ణయించింది. కానీ ఉన్నట్టుండి డీఎల్, జేఎల్ పోస్టులను నింపకుండానే నేరుగా పీజీటీ పోస్టుల భర్తీకి పూనుకున్నది. కనీస వ్యవధి ఇవ్వకుండానే 1:2 నిష్పత్తిలో ఫిజికల్ డైరెక్టర్, లైబ్రేరియన్, పీజీటీ అభ్యర్థుల మెరిట్ జాబితాను ప్రకటించడంతోపాటు, నాలుగు రోజుల్లోనే సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌ను పూర్తి చేసింది. 24 గంటలు తిరగక ముందే ఎంపికైన అభ్యర్థుల జాబితాను కూడా ట్రిబ్ విడుదల చేసింది. దివ్యాంగ అభ్యర్థులకు వైద్య పరీక్షలు నిర్వహించకుండానే పీజీటీ అభ్యర్థుల జాబితాను ట్రిబ్ విడుదల చేసింది. దీంతో దివ్యాంగుల కోటాను అసలు నింపుతున్నారా? లేదా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇదే విషయమై వివరణ కోరేందుకు ఫోన్‌లో మీడియా ప్రతినిధులు సంప్రదించినా ఉన్నతాధికారుల నుంచి స్పందన కరువైంది. ప్రభుత్వం కావాలనే బ్యాక్‌లాగ్ పోస్టుల సృష్టికి యత్నిస్తున్నదని అర్థమవుతున్నది. ఖాళీగా ఏర్పడే బ్యాక్‌లాగ్ పోస్టులను తిరిగి మరోసారి నింపేందుకేనని అభ్యర్థులు మండిపడుతున్నారు.

పోస్టింగులు లేకుండానే నియామకపత్రాలు

పీజీటీ, పీడీ, లైబ్రేరియన్ పోస్టులకు ఎంపికైన అభ్యర్థులకు నియామకపత్రాలను అందజేసేందుకు ట్రిబ్ సిద్ధమైంది. గురువారం మధ్యాహ్నం 3 గంటలకు ఎల్బీ స్టేడియం వేదికగా ట్రిబ్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ కార్యక్రమానికి సీఎం రేవంత్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై అభ్యర్థులకు నియామకపత్రాలను అందజేయనున్నారు. అయితే అభ్యర్థులను గురుకుల సొసైటీలకు మాత్రమే అలాట్ చేస్తూ నియామకపత్రాలను అందివ్వనున్నారు. ప్రభుత్వ నిర్ణయాన్ని, ట్రిబ్ నియామక ప్రక్రియను నిరసిస్తూ గురుకుల అభ్యర్థులు ఎల్బీ స్టేడియం వద్ద భారీ ధర్నాను నిర్వహించేందుకు సిద్ధమయ్యారు. ఈ తరుణంలోనే టీజీటీ పోస్టుల భర్తీకీ ట్రిబ్ కసరత్తు చేపట్టింది. అన్ని గురుకులాల్లో కలిపి టీజీటీ (ట్రైన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్) పోస్టులు 4,020 ఉండగా, 1:2 నిష్పత్తిలో మెరిట్ జాబితాను సిద్ధం చేసింది. నేడు లేదా రేపు జాబితాను ప్రకటించేందుకు ట్రిబ్ సన్నాహాలు చేస్తున్నదని సమాచారం.

ఉద్యోగార్థులను తరలించాలని కలెక్టర్లకు హుకుం

నిజామాబాద్, ఫిబ్రవరి 14(నమస్తే తెలంగాణ ప్రతినిధి): గురుకుల పోస్టులకు ఎంపికైన వారిని హైదరాబాద్‌కు తరలించాలని కలెక్టర్లకు ప్రభుత్వం హుకుం జారీ చేసింది. టీ, టిఫిన్లు ఏర్పాటుచేసి ప్రత్యేక బస్సుల్లో వారిని రాజధానికి తీసుకురావాలని ఆదేశాలు జారీ చేసింది. 12 గంటలకల్లా తరలిరావాలని ఆర్సీవోలు, ప్రిన్సిపాళ్లకూ ఆదేశాలు జారీ చేశారు. 100 కిలోమీటర్ల పరిధిలోని గురుకులాల సిబ్బంది ఆధార్, ఎంప్లాయ్ ఐడీ కార్డుతో 2 గంటలకల్లా రావాలనీ సర్క్యులర్ జారీ అయింది. దీంతో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ గురుకులాలకు చెందిన వారంతా తలలు పట్టుకుంటున్నారు. ఓ వైపు పరీక్షల సమయం ముంచుకొస్తున్న కీలక సమయంలో ఇలాంటి ఆదేశాలేంటని అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక నర్సింగ్ స్టాఫ్, పోలీస్ నియామకాలను తమ గొప్పతనంగా ప్రచారం చేసుకున్నది. నేడు గురుకుల అభ్యర్థుల విషయంలోనూ ప్రచారానికి ఎగబడుతున్నది. ఒక్క నోటిఫికేషన్ ఇవ్వకుండానే, నిరుద్యోగుల నుంచి ఒక్కటంటే ఒక్క దరఖాస్తును స్వీకరించకుండానే 27 వేల ఉద్యోగాలను భర్తీ చేసినట్టుగా కాంగ్రెస్ చెప్పుకుంటుండటం గమనార్హం.

మేడారంలో ఘనంగా మండమెలిగె

తాడ్వాయి, ఫిబ్రవరి14: ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారంలో బుధవారం సమ్మక్క-సారక్క మండమెలిగే పండుగను పూజారులు ఘనంగా నిర్వహించారు. ముందుగా సమ్మక్క పూజా మందిరంలో తల్లి గద్దెను, అమ్మవార్ల పూజా సామగ్రిని పూజారులు సిద్దబోయిన మునీందర్, కృష్ణయ్య శుద్ధి చేశారు. పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్దబోయిన జగ్గారావు ఆధ్వర్యంలో పూజారుల కుటుంబాలకు చెందిన ఆడపడుచులు తల్లి గద్దెకు అలుకుపూతలు నిర్వహించి ముగ్గులతో అలంకరించారు. ధూపదీప, నైవేద్యాలు సమర్పించి పూజలు నిర్వహించారు. డోలు వాయిద్యాల నడుమ గ్రామం మధ్యలోని బొడ్రాయి, పోశమ్మ గుళ్లకు చేరుకుని పూజలు చేశారు. కన్నెపల్లి నుంచి సారక్క, మేడారం నుంచి సమ్మక్క పూజారులు రాత్రి 8 గంటల సమయంలో తల్లుల గద్దెలకు చేరుకుంటారు. ఒకరికొకరు సాకను ఇచ్చిపుచ్చుకుని రహస్య పూజలు చేస్తారు. రాత్రంతా గద్దెల ఆవరణలో జాగారాలు చేస్తారు. కాగా.. మంత్రి సీతక్క రహస్య పూజల దగ్గరికి వెళ్తుండగా కొందరు పూజారులు అడ్డుకోవడంతో ఆమె వెనుదిరిగారు.

మేడారం ట్రస్ట్ బోర్డులో ఆదివాసేతరులను తొలగించాలి

ఆదివాసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దబ్బ గట్ల సుమన్

ఏటూరునాగారం, ఫిబ్రవరి 14: మేడారం ట్రస్ట్ బోర్డులో ఆదివాసేతరులను తొలగించాలని, లేకుంటే ప్రమాణ స్వీకారాన్ని అడ్డుకుంటామని ఆదివాసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దబ్బగట్ల సుమన్ బుధవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. ట్రస్ట్ బోర్డును ఆదివాసీలతో ఏర్పాటు చేయాలని అనేక సంఘాలు డిమాండ్ చేస్తున్నా.. లంబాడీలు, గిరిజనేతరులను నియమించడాన్ని వ్యతిరేకిస్తున్నామని చెప్పారు. ఈ నెల 11న ప్రమాణ స్వీకారం ఉన్నప్పటికీ.. సేవాలాల్ జయంతి రోజున నిర్వహించడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు.

భక్తుల ఇండ్లకే మేడారం ప్రసాదం

- టీఎస్ఆర్టీసీ లాజిస్టిక్స్ విభాగం శ్రీకారం

హైదరాబాద్, ఫిబ్రవరి 14 (నమస్తే తెలంగాణ): మేడారం సమ్మక్క, సారలమ్మ జాతరకు వెళ్లలేని భక్తుల ఇండ్ల వద్దకే ప్రసాదం పంపిణీ కార్యక్రమానికి టీఎస్ఆర్టీసీ బుధవారం శ్రీకారం చుట్టింది. ఈ మేరకు దేవాదాయ శాఖతో టీఎస్ఆర్టీసీ లాజిస్టిక్స్ విభాగం ఒక ఒప్పందం కుదుర్చుకున్నది. దేవస్థానం నుంచి అమ్మవార్ల ప్రసాదంతో పాటు పసుపు, కుంకుమను భక్తుల ఇండ్ల వద్దకు సంస్థ అందజేయనున్నది. ఈ నెల 21 నుంచి 24 వరకు జరిగే మహాజాతరకు బుధవారం నుంచి ఈ నెల 25 వరకు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో అమ్మవార్ల ప్రసాదాన్ని భక్తులు బుకింగ్ చేసుకునే సదుపాయాన్ని సంస్థ కల్పించింది.

అచ్చంపేటలోని ప్రధాన రహదారిపై ఆందోళన చేస్తున్న రైతులు

అచ్చంపేటలో మళ్లీ పల్లి రైతుల ఆందోళన

- మద్దతు ధర కల్పించాలని డిమాండ్
- నాగర్‌కర్నూల్-శ్రీశైలం రహదారిపై ధర్నా

అచ్చంపేట రూరల్, ఫిబ్రవరి 14: రాష్ట్రంలో రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంటను విక్రయించేందుకు నానా పాట్లు పడుతున్నారు. మద్దతు ధర కోసం ఇప్పటికే అచ్చంపేటలో వేరుశనగ రైతులు రెండుసార్లు రోడ్డెక్కినా ఫలితం లేకపోవడంతో బుధవారం మరోసారి ఆందోళనకు దిగారు. నియోజకవర్గంలోని అచ్చంపేట, ఉప్పునుంతల, అమ్రాబాద్, బల్మూరు మండలాల నుంచి దాదాపు 669 మంది రైతులు 40,596 బస్తాల (10,149 క్వింటాళ్ల) పల్లిని స్థానిక మార్కెట్‌కు తీసుకొచ్చారు. క్వింటా పల్లికి ప్రభుత్వం రూ.6,309 మద్దతు ధర నిర్ణయించగా.. పంట నాణ్యత బాగుంటే క్వింటాకు గరిష్ఠంగా రూ. 7,029, మధ్యస్తంగా ఉంటే రూ.6,380, నాణ్యత బాగాలేకపోతే రూ.5,015 చెల్లించాలని వ్యాపారులు నిర్ణయించారు. మార్కెట్‌కు వచ్చిన వేరుశనగలో దాదాపు సగం కొనుగోలు చేశారు. మిగిలిన పల్లికి తక్కువ ధర చెల్లిస్తామని వ్యాపారులు చెప్పడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఏప్రిల్ 16 వరకు ఈసెట్ దరఖాస్తులు

హైదరాబాద్, ఫిబ్రవరి 14 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలోని ఇంజినీరింగ్ కాలేజీల్లో లాటరల్ ప్రవేశాలకు నిర్వహించనున్న ఈసెట్-2024 బుధవారం నోటిఫికేషన్ విడుదలైంది. దరఖాస్తులను ఏప్రిల్ 16 వరకు స్వీకరిస్తామని కన్వీనర్ తెలిపారు. ఈసెట్ ప్రవేశ పరీక్ష మే 6న ఆన్‌లైన్‌లో నిర్వహిస్తామని పేర్కొన్నారు.

అదనపు ఎస్పీలు, డీఎస్పీల బదిలీ

హైదరాబాద్, ఫిబ్రవరి 14 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర హోంశాఖలో పది మంది అదనపు ఎస్పీలను బదిలీ చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకొన్నది. ఈ మేరకు ఆ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ జితేందర్ బుధవారం జీవో జారీ చేశారు. అలాగే, వివిధ విభాగాలలోని 95 మంది డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (సివిల్) సిబ్బందిని కూడా బదిలీ చేస్తూ డీజీపీ నిర్ణయం తీసుకొన్నారు. వీటికి సంబంధించిన ఉత్తర్వులు కూడా జారీ అయ్యాయి.

నిబంధనలకు గవర్నర్ తిలోదకాలు!

హైకోర్టులో దాసోజు లాయర్ సోంధి వాదనలు

హైదరాబాద్, ఫిబ్రవరి14 (నమస్తే తెలంగాణ): రాజకీయ పార్టీ నేతలుగా పేర్కొంటూ ఎమ్మెల్సీలుగా నామినేషన్ వేసేందుకు తిరస్కరించిన గవర్నర్.. రాజకీయ పార్టీకే చెందిన కోదండరాంను నియమించి నిబంధనలకు తిలోదకాలు ఇచ్చారని బీఆర్ఎస్ పార్టీ నేత దాసోజు శ్రవణ్‌కుమార్ తరపు సీనియర్ న్యాయవాది ఆదిత్య సోంధి హైకోర్టు దృష్టికి తెచ్చారు. గవర్నర్ పదవిలోకి వచ్చాక రాజకీయం అనే వాళ్లవి (గవర్నర్ల) కూడా రాజకీయ నియామకాలేనని చెప్పారు. అధికార పార్టీ రాజకీయాలతో సంబంధం లేకుండా ఉన్న వాళ్లను కేంద్ర ప్రభుత్వం గవర్నర్లుగా నియమించబోదని పేర్కొన్నారు. ఎమ్మెల్సీల నియామక వ్యవహారంలో రాజకీయం అనే గవర్నర్ కూడా గతంలో (గవర్నర్ నియామకానికి ముందు) రాజకీయ పార్టీతో సంబంధాలు నెరిపారని చెప్పారు. గవర్నర్ కోటా కింద ఎమ్మెల్సీలను నియమించాలని గత కేసీఆర్ ప్రభుత్వంలోని మంత్రివర్గం చేసిన సిఫార్సులను గవర్నర్ తిరస్కరించడాన్ని సవాల్ చేస్తూ దాసోజు శ్రవణ్‌కుమార్, కుర్రా సత్యనారాయణ వేర్వేరుగా దాఖలు చేసిన పిటిషన్లను ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జే అనిల్‌కుమార్‌తో కూడిన ధర్మాసనం బుధవారం విచారణను కొనసాగించింది. ఈ కేసులో కోదండరాం దాఖలు చేసిన అఫిడవిట్‌లో తాను ఎందుకు రాజకీయ పార్టీని ఏర్పాటు చేయాల్సి వచ్చిందో హైకోర్టుకు వివరించారని చెప్పారు. అంటే తాను రాజకీయ పార్టీకి చెందిన వ్యక్తినని ఒప్పుకున్నారని, తమను నిరాకరించిన గవర్నర్ తిరిగి రాజకీయ పార్టీకే చెందిన వ్యక్తిని ఎమ్మెల్సీగా నియమించారని చెప్పారు. గవర్నర్ చర్య వివక్షా పూరితమైనదిగా ప్రకటించాలని సోంధి కోరారు. మరో పిటిషనర్ కుర్రా సత్యనారాయణ వాదనలు గురువారం కొనసాగనున్నాయి. పిటిషనర్లు దాసోజు, కుర్రా, ప్రతివాదులు గవర్నర్ కార్యాలయం, కోదండరాం, అలీఖాన్ తమ వాదనలు లిఖిత పూర్వకంగా గురువారం సమర్పించాలని హైకోర్టు ఆదేశించింది.

పోలీస్‌స్టేషన్ టూరిస్ట్ ప్లేస్ అనుకొంటున్నారా?

ఓ మహిళ తో పోలీసుల వైఖరిపై హైకోర్టు ఆగ్రహం

హైదరాబాద్, ఫిబ్రవరి14 (నమస్తే తెలంగాణ): ఓ మహిళ ఐదు గంటలపాటు పోలీస్‌స్టేషన్‌లో గడిపేందుకు అదేమీ పర్యాటక ప్రదేశం కాదని హైకోర్టు ఘాటు వ్యాఖ్య చేసింది. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు స్టేషన్‌లో మహిళ ఉండటంపై ఆగ్రహం వ్యక్తం చేసింది. ఫిర్యాదు ఇవ్వలేదు కాబట్టి కేసు నమోదు చేయలేదని పోలీసులు చెప్పడం, దానిని సమర్థిస్తూ ప్రభుత్వ న్యాయవాది హైకోర్టులో చెప్పడంపై నిప్పులు చెరిగింది. కరీంనగర్‌లో ఒక జడ్జి కుమారుడైన వికాస్ కుతాడిపై చేసిన ఫిర్యాదు ఆధారంగా పోలీసులు కేసు నమోదు చేయకపోవడంపై వంగ రమ్య అనే మహిళ వ్యాజ్యాన్ని దాఖలు చేశారు. ఈ దాఖలుపై హైకోర్టు రిజిస్ట్రీ అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ వ్యవహారంపై హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జే అనిల్‌కుమార్‌తో కూడిన ద్విసభ్య ధర్మాసనం బుధవారం విచారణ చేపట్టింది.

జేఈఈ ఫలితాల్లో సీవోఈ విద్యార్థుల సత్తా

హైదరాబాద్, ఫిబ్రవరి14 (నమస్తే తెలంగాణ): జేఈఈ మెయిన్-1 ఫలితాల్లో ఎస్టీ గురుకుల సొసైటీ ఆధ్వర్యంలోని సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ (